# ○ బోడెమ్మల సమ్మె ○

శ్రీ ఆకెళ్ల శాస్త్రి.

సాయంకాలమయింది. ఏమీతోచక పఘ్లు కొడుతూ సిగరెట్టు అగ్నిహోత్రం తోడుగా ఆలోచనా ఝుంఝూమారుతాల్ని వొదుల్తూ ఈజీ చైర్‌లో పడుకున్నాను. వాచీ ఐదు కొట్టింది. గబగబ టాయిలెట్టై బీచికి దారితీశాను. మా వీధి చివరకు వెళ్ళేటప్పటికి అక్కడ ఒక పెద్ద బోర్డు కొట్టబడివున్నాది. దానిమీద తాటికాయలంతేసి అక్షరాలతో "వితంతు సంఘం, మానేజరు, ప్రెసిడెంటు .... వెంకమ్మగారు" అని వ్రాసివుంది. మేడమీద ఏదోసందడి వినబడుతోంది కూడాను. నాలాగే ఇంకా కొంతమంది ఆబోర్డువేపు చూసి ఏవో గొణుక్కుంటూ, నవ్వుకుంటూ వెళ్లిపోతున్నారు. కాని నేనుమట్టుకు అదేమిటో చూద్దామని లోపలకువెళ్లి ఆమెట్లవద్ద కాస్త చాటుగా నిలుచున్నాను ఈగమ్మత్తు చూచినతరువాత బీచికి వెళదామని.

కొంచెంసేపటికి సందడి కొంచెం తగ్గింది. 'గంగాభాగీరథీతుల్యురాలైన వెంకమ్మగారికి ఈరోజున మన వితంతు సంఘంవారు యిచ్చిన కొన్ని బిరుదులు నే చదువుతాను' అని ఓ పెద్దగొంతుక వినే సరికి గప్‌చప్ అయింది హాలు. "అవి ఏమనగా, 1. సర్వాంగక్షౌరాగ్రేసర; 2. సర్వాంగవిభూతి ధారిణి; 3. శుద్ధాచారభూయిష్ట; 4. వితంతు సంఘోద్ధారక' అని మతమునకు చతుర్వేదములు, విష్ణువునకు చతుర్బాహువులు, బ్రహ్మకు చతుర్ముఖములు, మన సంఘోద్ధారకులు, అప్రతీతులు, అద్వితీయులు అయిన శ్రీశ్రీశ్రీ వెంకమ్మగార్కి కూడా అటులనే చతుర్బిరుదులు. ఇది తమకందరకు ఎంతో ఇష్టంబని నేతలుచుకొంటాను. తరువాత మీయిష్టంబు. నేను శలవుతీసుకుంటాను" అని తన పాండిత్యం కొంచెం చెలాయించి ఆవిడ వూరుకుంది. జయజయధ్వానులు కూడా వినబడ్డాయి.

తిరిగి మరోబంగుగొంతుక, (మాటలబట్టి వెంకమ్మదే అనుకున్నాను) 'నేడు' అని వుపన్యాసం ఆరంభించింది. 'మన వితంతుసంఘం అంతా నన్ను సన్మానించినందుకు, బిరుదులర్పించి గౌరవించినందు వ్వలనను, నేనెంతయూ కృతఘ్న....పొరబాటు... కృతజ్ఞురాలని. నా కృతజ్ఞాపూపూర్వకంగా మన సంఘసంస్కరణ నిమిత్తమై నేను కొన్ని విషయాలు చెప్పదలచుకున్నాను. అంగీకరిస్తారా!"

అందరూ:—(గోల్లుచేస్తో) "ఓ, అంగీకారమే. వేగంకానివ్వండి."

వెంకమ్మ:—'ఈ కలికాలం పాపమయం ... అవునా, కాదా?'

అందరూ:—'అవును, సత్యం, ముమ్మాటికి మీవాక్యం సత్యం .... !'

వెంకమ్మ:—'ఇటువంటి పాపమయమైన కలికాలంలో, జనసంఖ్య ఇంకా ఎక్కువ అవుతూ వుందే!...దీనికి కారణం తెలుసా?...మీలో ఎవరైనా చెప్పగలరా! .... ఒక్కరైనా చెప్పలేరా? ....'

అందరు:—'మావల్ల కాదు. అందుకు మీరే అర్హులు. మాకు శక్తిచాలదమ్మ. మాకంతవరకూ మా పుట్టింటూరు చదివిస్తేకదూ! ...'

వెంకమ్మ:—(వెకిలినవ్వుతో) 'చూచారా, మీరెంత అమాయకులో! నల్లత్రాచుని చూసి ఏమో అనుకున్నారట మీలాంటి అమాయకులే. ఈమాత్రం ప్రశ్నకి జవాబు చెప్పలేకపోయారు. మీలాంటి అమాయకులు ఈ ప్రపంచకంలో ఎవరైనా వున్నారా? .... లేరనే చెప్పవచ్చును, అవునా?'

అందరూ:—'అవును తల్లీ- అవును, మూడక్కు రాలా అవును.'

వెంకమ్మ:—ఐతే కారణం చెబ్తాను వినండి. ప్రపంచకములో (గొంతుక శకలించి) ఏమూలనో 'సత్యం' అనేది ఇంకా వుండాలి. లేకపోతే ఈ పాటికి ఈ ప్రపంచకం మటుమాయం అవవలసిందే. ఇంకా 'ధర్మం' అనేది ఎక్కడనో వుంది. అవి మరెక్కడా కాదు. పండుదబ్బపండువలె, పవిత్రమై, నున్ననైవున్న మన బోడమ్మలపై వితంతు సంఘ సంస్కర్తలపై. మూర్తీభవించాయి మీకు తెలియక పోవచ్చును. వితంతువనేది, ఒకరోజున తల నున్నగా చేయించి విభూతి దేహమంతయు పెట్టుకొనిన యెడల కోటియజ్ఞఫలం అంటాయి మనశాస్త్రాలు. వితంతువై కూడా వెంట్రుకలతో వున్నయడల మహాపాపమని ఓపక్కనుండి ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అంచేత మనమే ఈప్రపంచకాన్నత్యానికి కారణులము. మూర్తీభవించిన, ఘనీభవించిన అచంచలమైన పుణ్యమూర్తులము.—

1-వ బోడమ్మ:—ఏంచోద్యం .... ఎక్కడా వినలేదూ.

2-వ బోడమ్మ:—ఓహోహో! వేదవాక్కులు.

3-వ బోడమ్మ:—అమృతబిందువులే ఆ మాటలు. ఏంసాగను. (అందరూ శేష్! శేష్!!

వెంకమ్మ:—తొందరపడకండి, అసలు నేను చెప్పబోయేది ఇంకావుంది. ఏమిటంటే మన సంఘం గురించి...ఇటువంటి మనలని సినీమాలు అనే నెపంతో అగౌరవించుతున్నారు. మన ఆచార వ్యవహారాల్ని, మన భక్తిని, అన్నింటిని ఎదుర్కుంటూ, మన సంఘానికి అపకీర్తి తెస్తున్నారు. మన సంఘాన్ని అవమానించటానికే, మళ్ళీ పెళ్ళిలో ఆబోడమ్మకి నా పేరు పెట్టారు కూడాను.

అంచాత దీనికి తగినపని ఏమిటంటే మనంఅంతా కలిసి ఒక సమ్మె చెయ్యాలి. తప్పక చెయ్యాలి. అందరూ వొప్పుకుంటారా?....

అందరూ:—'ఘంటాపథంగా వొప్పుకుంటున్నాము. జై! వితంతు సంఘానికీ జై! సమ్మె, సమ్మె! వెంకమ్మగారికి జై' అని...గొల్లుగా అందరూ లేచారు. వెంకమ్మగారి వుపన్యాసంకూడా పూర్తిఅయింది. ఇదంతా వినిన నాకు నవ్వుఆగలేదు పకపకనవ్వాను. నానవ్వు వినేసరికి... అందరూ ఒక్కమారు .... పైటలేనా సవరించుకోవద్దా! చెప్పలేను ఆదృశ్యాన్ని ... క్రిందకు దిగివస్తూవుంటే ఒకావిడకు అకస్మాత్తుగా కాలుజారింది. ఆజారడం నామీద మద్దెల్లాగపడ్డాది సగంసగం వీడిన బట్టతో. మిగిలినవారందరూ ఒక్కమారు నన్ను చుట్టముట్టేసి మేడమీదికి ఈడ్చుకెళ్లారు. వెంకమ్మగారు... నవరంధ్రాలతో వూపిరిబిగపట్టి ... పళ్లుకొరుకుతూ, నావద్దకువచ్చి ఒక్క లెంపకాయకొట్టింది. నాకు కూడా కోపంఆగిందికాదు. అణచిపెట్టి ఒక్కలెంపకాయ నాబలంపూరా కట్నం ఇచ్చాను.

"అమ్మా!" అని ఒక్క ఆసిరమ్మకేక వినబడేసరికి గతుక్కున త్రుళ్లిపడిలేచాను. నా దోమతెరలో మాఆవిడి ఎందుకో లేచికూర్చునివుంది.

'ఎందుకే అలా కేకవేశావు?' అని అడుగుతే ...మరింతఏడుస్తూ 'దవడ నొప్పెడుతోంది. అంత లెంపకాయ కొట్టేరు అంది'.

కళ్లు నులుపుకుంటూ లేచివచ్చి, టైము చూసేసరికి, 12 అయింది. నాకలకి నేనే ఆశ్చర్యపోయాను. బోడమ్మల సమ్మెగురించి తల్చుకుని నవ్వుతూ, మాఆవిడకి ఆసమ్మె చెబుతూ తిరిగి నాపక్క చేరుకున్నాను.

"కథాంజలి"

అన్ని హిగ్గిం బాదంసు బుక్కుస్టాలులోను దొరుకుతుంది.